
# ఫేమస్ స్వీట్స్


ఇండియా అనేక శతాబ్దాలుగా విభిన్న వంటకాలకు పేరొందింది. మరీ ముఖ్యంగా ప్రత్యేకమైన స్వీట్స్ కూడా మనం కేరాఫ్‌గా ఉన్నాం. చాలా వంటకాలకు ఇంటర్నేషనల్ గుర్తింపు సైతం లభిస్తోంది. దాంతో వీటికి నకిలీలు పుట్టుకురాకుండా పలు స్వీట్స్‌కు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జిఐ) ట్యాగ్ ఇచ్చారు. ఈ ట్యాగ్ ప్రత్యేక ప్రాంతానికి చెందిన, అక్కడి పద్ధతుల్లో తయారయ్యే సంప్రదాయ మిఠాయిలను పరిరక్షించడంతో పాటు గ్లోబల్ స్థాయిలో మరింత గుర్తింపును ఈ ట్యాగ్ తెచ్చిపెడుతుంది.



ముందుకు మనందరికి మన తిరుపతి లడ్డూ గొప్పతనం తెలిసిందే. అవి కాకుండా ప్రస్తుతం అలాంటి గుర్తింపు పొందిన గ్లోబల్ స్వీట్స్ చాలా ఉన్నాయి. దార్వాడ్ పేడ, కర్ణాటక రాష్ట్రపు సంప్రదాయ స్వీట్. చిక్కటి పాలతో దీని తయారీ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. అలాగే ఎర్రనిరంగులో ఉండే ఉత్తరప్రదేశ్ బనారస్ లాల్ పేడకు ఆ రంగు రావడానికి కారణం వండే శైలి అట. వారణాసి మూలాలు కలిగిన ఈ స్వీట్ పాలపిండి, పప్పులు, సీడ్స్ మేలు కలయిక.

ఇక మనకూ బాగా పరిచయమైన బెంగాల్ రసగుల్లా. చక్కెర పాకంలో ముంచిన సున్నితంగా నోట్లో వేసుకుంటే కరిగిపోయే ఈ స్వీట్. పశ్చిమ బెంగాల్‌కి చెందింది. అలాగే ఒడిశాకు చెందిన మరో రకం రసగుల్లాకి కూడా జిఐ ట్యాగ్ ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాను ప్రపంచ పటంలో నిలబెట్టిన "పేపర్ స్వీట్" ఇప్పుడు అంతర్జాతీయంగా ఆకర్షిస్తోంది.

ఈ ఆత్రేయపురం పూత రేకులు కూడా జిఐ ట్యాగ్‌ను పొందాయి. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంకు చెందిన బందరు లడ్డు.. కూడా ఈ గుర్తింపును అందుకుంది. కొబ్బరిపాలు, గుడ్లు తదితరాలను మేళవించి చేసే గోవన్



బెబింకా అనే గోవా స్వీట్ 16 పొరలతో తీయటి అనుభూతులు పంచుతూ ప్రపంచవ్యాప్త గుర్తింపునూ దక్కించుకుంది.

గోధుమ పిండి, నెయ్యి, బెల్లంతో తయారయ్యే తమిళనాడుకు చెందిన తిరునల్వేలి హల్వాకు కూడా చాలా ఫేమస్. ఇక కేరళకు వెళ్లే టూరిస్టులు తప్పకుండా రుచి చూసేది, తమతో పాటు వెంట తెచ్చుకునే కోజికోడ్ హల్వా గురించి మనలో చాలా మందికి తెలిసిందే. ఇప్పుడు అది ప్రపంచానికి కూడా తెలిసింది.

గుమ్మడి గింజలతో తయారయ్యే పేత ఆగ్రా ప్రాంతపు వంటకంగా ప్రపంచ ప్రాచుర్యం పొందింది. తాజ్‌మహల్‌ని సందర్శించేవారు చవులూరించే పేతను కూడా రుచిచూడందే వదలరు. బీహార్‌కు చెందిన సిలావో కాజా... ఇలా డజనకు పైగా ఇండియా స్వీట్స్ ఉన్నాయి.





# 'బాడీ స్ప్రే' పరిమితి మించొద్దు

ప్రస్తుతం ఇంటి నుంచి బయటికి అడుగెయ్యాలంటే.. ఒంటికి సెంటు కొట్టాల్సిందే. చెమట వాసన రావొద్దన్నా, శరీరం సువాసనలు వెదజల్లాలన్నా.. బాడీ మొత్తం 'బాడీ స్ప్రే' చేసుకోవాల్సిందే! శరీరానికి మాత్రమే కాదు.. రూమ్ కూడా కమ్మటి వాసనలతో నిండిపోవాలని రూమ్ స్ప్రేలూ వాడేస్తున్నారు. ఈ సువాసనలు మనసుకు హాయినిస్తాయి. కానీ, ఆరోగ్యానికి చేటు తెస్తాయి. ఇప్పుడొస్తున్న అనేక రకాల పర్‌ఫ్యూమ్స్, రూమ్ ఫ్రెషనర్ల తయారీలో ప్రమాదకర రసాయనాలను వాడుతున్నారు. విభిన్నమైన సువాసనల కోసం, అవి ఎక్కువ సమయంపాటు తాజాగా ఉండటం కోసం.. బెంజీన్, స్టైరిన్, ఫార్మాల్డిహైడ్, థాలేట్స్, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ లాంటివి విరివిగా కలిపేస్తున్నారు. ఈ రసాయన సమ్మేళనాలు శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కొన్ని చర్మానికి హాని చేస్తే.. మరికొన్ని క్యాన్సర్‌కు దారితీస్తాయి.

**బెంజీన్:** బాడీ స్ప్రే సువాసనలు ఎక్కువ సమయంపాటు శరీరంపై ఉండేందుకు 'బెంజీన్' అనే రసాయనాన్ని వాడతారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే బెంజీన్‌ను 'కార్సినోజెన్'గా ప్రకటించింది. అంటే.. దీనిని దీర్ఘకాలంపాటు వాడితే క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

**స్టైరిన్:** ఇది ఓ క్యాన్సర్ కారకం. శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. చికాకును కూడా కలిగిస్తుంది.

**థాలేట్స్:** సువాసనలు ఎక్కువసేపు ఉండేందుకు ఎయిర్ ఫ్రెషనర్లలో వీటిని వాడుతుంటారు. ఇవి మహిళల్లో హార్మోన్ల అసమతుల్యతను ప్రేరేపిస్తాయి. ఫలితంగా.. సంతాన సమస్యలు పెరుగుతాయి. పిండాల ఎదుగుదలపైనా ప్రభావం చూపుతాయి.

**ఎసిటాల్డిహైడ్:** ఇది నాడీవ్యవస్థ, శ్వాసకోశ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దీర్ఘకాలంలో క్యాన్సర్‌కు దారితీస్తుంది.

**వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్:** వీటిని ఎక్కువగా రూమ్ ఫ్రెషనర్ల తయారీలో వాడుతారు. ఇవి శ్వాసకోశ సమస్యలతోపాటు కళ్లు, ముక్కు, గొంతు భాగాల్లో చికాకు కలిగిస్తాయి.



# రోజుకు ఒక్క దానిమ్మ చాలు



దానిమ్మ అనేక వ్యాధులకు చాలా ఉపయోగపడుతుంది. దానిమ్మపండు అత్యంత ఆరోగ్యకరమైన, పోషకమైన పండ్లలో ఒకటి. అంతేకాక తాజాగా వచ్చిన అధ్యయనాల ప్రకారం.. రోజుకు ఒక్క దానిమ్మ పండు లేదా అర కప్పు దానిమ్మ గింజలు తినడం ద్వారా శరీరానికి అనేక రకాల లాభాలు లభిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ రత్నాల్లాంటి గింజలు మంచి రుచితో పాటు, శరీరానికి యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, మరియు విటమిన్లు అందిస్తాయి. ఇక రోజూ అలాంటి పండును తీసుకోవడం హెల్త్ కు చాలా మేలు చేస్తుంది.

**పోషకాలు పుష్కలం..**

దానిమ్మపండులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, పోషకాలు ఉంటాయి. ఈ పండు పేగులకు కూడా ఒక వరం. దానిమ్మలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లను కూడా దూరంగా ఉంచుతుంది. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే దానిమ్మ చర్మంను మెరిసేలా చేస్తుంది. దీనిలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల, ఇది పేగు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. దానిమ్మ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది. శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తుంది.

**గుండె ఆరోగ్యం**

దానిమ్మ రసాన్ని తరచూ తీసుకుంటే రక్తపోటు తగ్గించేందుకు, ఆర్టిరీలను రక్షించేందుకు సహాయపడుతుంది. ఇది శరీరంలో ఉండే హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించి, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుంది. అలాగే కొలెస్ట్రాల్ నిల్వలు తగ్గించడం, అథెరోస్క్లెరోసిస్ వంటి హృదయ సంబంధిత సమస్యలను నివారించడంలో ఇది కీలకం.

అంతేకాక రక్తపోటును తగ్గించడం, ధమనులలో ఫలకం ఏర్పడకుండా నిరోధించడం ద్వారా గుండె ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. ఫైబర్ కంటెంట్ మంచి జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది. దానిమ్మలో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. ఇది కాలజన్ ఉత్పత్తిని ప్రోత్సహించడం, ఒత్తిడితో కలిగే చర్మ నష్టం తగ్గించడం, వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా రావడం వంటి లాభాలను కలిగిస్తుంది. ఫలితంగా చర్మం మరింత ప్రకాశవంతంగా కనిపిస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం.. దానిమ్మ పండు ప్రోస్టేట్ కేన్సర్ నిరోధానికి సహాయపడే సహజమైన పదార్థం. 2014 అధ్యయనం ప్రకారం, దానిమ్మలో ఉండే పాలీఫినాల్స్ ప్రోస్టేట్ క్యాన్సర్ కణాల వృద్ధిని తగ్గిస్తాయి. మిషీలపై జరిగిన ప్రయోగాల్లో, దానిమ్మ ఎక్స్‌ట్రాక్ట్ వలన పీఎస్‌ఏ లెవల్స్ తగ్గడం, గడ్డకట్టిన కణాల పెరుగుదల మందగించడం కనిపించింది. ఇది బ్రెస్ట్, లంగ్, స్కిన్ కేన్సర్ విషయంలోనూ కొంత రక్షణ కలిగించే అవకాశముందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

